అందం.. ఆహ్లాదం

- వార్డుల అభివృద్ధికి ప్రతీకలు పార్కులు
- వాకింగ్, వ్యాయామం పరికరాలతో కళకళ
- 16వ వార్డులో సుందరంగా విద్యానగర్ కాలనీ పార్కు



16వ వార్డు విద్యానగర్ పార్కులో ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలు



పార్కులో షటిల్ కోర్టు, వాకింగ్ ట్రాక్

మద్దిలపాలెం: అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండే పార్కులు నేడు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. ఎన్నో ఏళ్ల తర్వాత సుందరంగా తీర్చిదిద్దడంతో నగరంలోని కాలనీలకు కొత్త కళను తీసుకొచ్చాయి. అందం.. ఆహ్లాదం.. ఆరోగ్యానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నాయి. జీవీఎంసీ 16వ వార్డు విద్యానగర్ కాలనీలో ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి దూరంగా ఉన్న పార్కును కార్పొరేటర్ మొల్లి లక్ష్మి చొరవతో మంజూరైన జీవీఎంసీ నిధులతో సుందరంగా ముస్తాబు చేసి పూర్వ వైభవం తీసుకొచ్చారు.

రూ.12 లక్షలతో వసతుల కల్పన

సుమారు 30 ఏళ్ల క్రితం భానునగర్ కాలనీలో విద్యానగర్ పార్కును నిర్మించారు. తరువాత నిర్వహణను గాలికి వదిలేయడంతో పార్కు గోడలు శిథిలమైపోయాయి. పిచ్చి మొక్కలతో నిండిపోయింది. అప్పుడప్పుడు కాలనీవాసుల సహకారంతో తుప్పలు తీసినా పార్కులోకి రావడానికి ఎవరూ ఆసక్తి చూపేవారు కాదు. 16వ వార్డు కార్పొరేటర్ మొల్లి లక్ష్మి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తొలి ఏడాదిలోనే విద్యానగర్ పార్కు అభివృద్ధికి రూ.12 లక్షలు మంజూరయ్యేలా కృషి చేశారు. ఈ నిధులతో పార్కులో పలు వసతులు కల్పించి, అభివృద్ధి చేశారు. పార్కులో వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. వాకింగ్ ట్రాక్, షటిల్ కోర్టు నిర్మించారు. పార్కు చుట్టూ మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించారు. కాసేపు కూర్చొని సేద తీరడం కోసం సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. శిథిలమైన పార్కు గోడలను పునర్నిర్మించారు.

వాటికి పెయింటింగ్ వేసి అందంగా తీర్చిదిద్దారు. దీంతో కాలనీకి విద్యానగర్ పార్కు మణిహారం మారింది.

వార్డులో పార్కుల అభివృద్ధికి పెద్ద పీట



వార్డులో ప్రధాన సమస్యలను గుర్తించి దశల వారీగా పరిష్కరిస్తున్నాం. కాలనీ మధ్యలో అధ్వానంగా ఉన్న పార్కుల అభివృద్ధిపై దృష్టి పెట్టాం. దీనిలో భాగంగా విద్యానగర్ పార్కును రూ.12 లక్షల వ్యయంతో అభివృద్ధి చేశాం. ఇదే వార్డులో గెజిటెట్ ఆఫీసర్ కాలనీలో శిథిలమైన పార్కులో మరో రూ.12 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశాం. పార్కులను ప్రజలు సద్వినియోగం చేసుకుని, నిర్వహణ బాధ్యతలు తీసుకోవాలి.

– మొల్లి లక్ష్మి, 16వ వార్డు కార్పొరేటర్

క్లుప్తంగా

అప్పన్న సన్నిధిలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న వంశీకృష్ణ శ్రీనివాస్ దంపతులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ సతీ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆయనకు స్వామివారి ప్రసాదాన్ని సూపరింటిండెంట్ సునీల్ అందజేశారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డులో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక వివేకానందనగర్ పార్కులో జీజీ హాస్పటల్ సహకారంతో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో సుమారు 200 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ జి.శివప్రసాద్, డాక్టర్ గీతా శివ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆరోగ్య సదస్సు



సదస్సులో పాల్గొన్న ఆరోగ్య నిపుణులు

అరిలోవ: పాత డెయిరీ ఫారం సమీప ఇందిరా గాంధీ నగర్‌లో ఉన్న ఆనంద్ మార్గ్ చిల్డ్రన్ హోమ్‌లో నిర్వహిస్తున్న ఆరోగ్య సదస్సు ఆదివారం ముగిసింది. ఆనంద్ మార్గ్ సీనియర్ ఆచార్యులు, నేచురోపతి వైద్య నిపుణుడు రామేశ్వరానంద అవధూత, డాక్టర్ ధీరజ్ వివిధ వ్యాధులు, వాటి పరిష్కారానికి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. పలు రకాల మూలికలు, మొక్కలు ఆరోగ్య పరిరక్షణలో వాటి ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఆనంద్ మార్గ్ విశాఖ యూనిట్ ఇన్‌చార్జి సౌమ్యానంద అవధూత, కేసవ్ సునీల్ మాట్లాడుతూ మంచి ఆహారం, మానసిక ప్రశాంతతతో ఆరోగ్యవంతమైన జీవనాన్ని కొనసాగించడానికి వీలవుతుందన్నారు.

ఎర్నిమాంబకు అష్టమి పూజలు



ఎర్నిమాంబకు హారతులు ఇస్తున్న అర్చకుడు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి కాన్వెంటు కూడలిలోని వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆషాఢమాస శుద్ధ అష్టమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. దేవాదాయశాఖ, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలు ఏర్పాటు చేశారు. దేవాదాయ శాఖ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల క్రమశిక్షణ బాధ్యత తల్లిదండ్రులదే



మాట్లాడుతున్న గొండు సీతారాం

ఆరిలోవ: విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంపొందించడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. ఆదివారం కృష్ణాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల సమావేశ మందిరంలో 'విద్యార్థుల క్రమశిక్షణ–తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర'అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లల బంగారు భవిష్యత్‌కు విద్యార్థి దశ కీలకంగా నిలుస్తుందన్నారు. ఈ దశను అన్ని కోణాలలో తీర్చిదిద్దితేనే వారి ప్రగతి సాధ్యపడుతుందన్నారు. గురుకుల పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు భారత జాతి గర్వించదగిన పిల్లలుగా పేరు ప్రఖ్యాతులు సాధించేందుకు అహర్నిశలు కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులు వారిని నిరంతరం గమనిస్తూ అవసరమైన సూచనలు చేయాలని చెప్పారు. పాఠశాల ప్రిన్సిపాల్ బి.కె.రమేష్ మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులు క్రమశిక్షణతో పెరిగేలా సమావేశాలు, సదస్సులు ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించి పాఠశాల ప్రతిష్టను మరింత పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో పేరెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ, స్వారో సంస్థ ప్రతినిధి కనకరాజు, స్కూల్ పేరెంట్ కమిటీ అధ్యక్షుడు గోవింద్, ప్రతినిధి నీలవేణి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆగస్ట్ 22న కనకమాంబ జాతర



జాతర మహోత్సవంపై సమావేశమైన గ్రామ సంఘాలు సభ్యులు

మద్దిలపాలెం : పాత వెంకోజీపాలెంలోని కనకమాంబ అమ్మవారి జాతర ఆగస్టు 22న నిర్వహించాలని గ్రామ సేవా సంఘాల సభ్యులు నిర్ణయించారు. ఈ మేరకు ఆదివారం సీతారామ గ్రామ సేవా సంఘం, రాధాకృష్ణ సేవా సంఘం, శెట్టి బలిజ సేవా సంఘం సమావేశమయ్యాయి. ప్రతి ఏడాది మాదిరిగా జాతరను వైభవంగా నిర్వహించాలని తీర్మానం చేశారు. ఈ వేడుకల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించి నిర్ణయం తీసుకున్నారు.

శిష్టకరణాలను ఓబీసీలో చేర్చాలని వినతి

ఎంవీపీ కాలనీ: శిష్టకరణాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని శిష్టకరణ సాధన సమితి నాయకులు కోరారు. ఈ మేరకు సమితి నాయకుడు ఎన్.గజపతిరావు ఆధ్వర్యంలో 200 మంది శిష్టకరణాలు ఆదివారం రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావును లాసన్స్‌బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గజపతిరావు మాట్లాడుతూ ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపాదించిన ఓబీసీ జాబితాలో శిష్టకరణ సామాజిక వర్గం ఉన్నట్లు తెలిపారు. అయితే ఆ జాబితాను అధికారికంగా ఆమోదించాల్సిన అవసరముందన్నారు. ఈ నేపథ్యంలో జాబితా ఆమోదానికి కృషి చేయాలని జీవీఎల్‌ను కోరారు. దీనిపై ఎంపీ జీవీఎల్ మాట్లాడుతూ రానున్న శీతాకాల సమావేశంలో ఈ విషయంపై పార్లమెంట్‌లో చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సమితి జాతీయ అధ్యక్షుడు బెనర్జీ, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

తులసి మొక్కల పంపిణీ



తులసి మొక్కలు, రామకోటి పుస్తకాలు అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఎంవీపీ కాలనీ: రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖ స్మార్ట్ సిటీ ఆధ్వర్యంలో పెదజాలరిపేటలోని రామాలయం వద్ద ఆదివారం విద్యార్థులకు తులసి మొక్కలు, రామకోటి పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భగవద్గీతపైన అవగాహన కల్పించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు మొక్కలు, పుస్తకాలు పంపిణీ చేసినట్టు క్లబ్ కార్యదర్శి రవికుమార్ తెలిపారు.

'కేంద్ర ప్రభుత్వం సమాధానమివ్వాలి'

కూర్మన్నపాలెం: కార్మికులు పట్టు వదలక చేస్తున్న ఉక్కు పరిరక్షణ పోరాటానికి కేంద్ర ప్రభుత్వం సమాధానమివ్వాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 878వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీక్ష శిబిరాన్ని ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మా ట్లాడుతూ కేంద్రం ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముకుంటూ పోతే భారతదేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థా మిగలదన్నారు. ఇప్పటికే దేశంలో కొత్త పరిశ్రమలు ఏర్పాటు కాక, నిరుద్యోగ సమస్యతో యువత చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారని మండిపడ్డారు.

తీరానికి కొత్త శోభ



ఐటీ జంక్షన్ వద్ద సుందరంగా తీర్చిదిద్దిన బీచ్

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు రోజురోజుకూ మరింత సుందరంగా ముస్తాబవుతోంది. ఇప్పటికే డివైడర్లకు, సైడ్ వాల్స్‌కు, ఫుట్ పాత్‌లకు వివిధ వర్ణాలతో అద్భుతమైన కళాకృతులతో రంగులు అద్దారు. విద్యుత్ దీపాలతో రాత్రి సమయాల్లో మరింత అందంగా కనిపిస్తుంది. దీనికితోడు ఆదివారం ఐటీ జంక్షన్ కల్వర్టు వద్ద ఐరన్ బాక్స్‌లలో నల్లరాళ్లు ఏర్పాటు చేయడంతో మరింత సుందరంగా కనిపిస్తోంది.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

కంటైనర్ ఢీకొని మహిళ దుర్మరణం



ఘటనా స్థలంలో అపస్మారక స్థితిలో ఉన్న సరోజిని

మల్కాపురం: మారుతి సర్కిల్ వద్ద ఓ కంటెయినర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న సంఘటనలో తీవ్ర గాయాలపాలై, అపస్మారక స్థితికి వెళ్లిపోయిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. ఘటనకు సంబంధించి మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పరవాడ సమీపంలోని ఫార్మసీ కాలనీకి చెందిన సి.సరోజిని (37) భర్తతో మనస్పర్థల కారణంగా విడిగా జీవిస్తున్నారు. ఆమెకు ఇద్దరు అమ్మాయిలు సంతానం. వారు హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నారు. సరోజిని సొంత పనుల నిమిత్తం ఆదివారం ఉదయం నగరానికి స్కూటీపై వెళ్లి, తిరిగి వస్తుండగా వీడీఆర్ గొడౌన్స్ సమీపంలోని మారుతి సర్కిల్ వద్ద వెనుక నుంచి వస్తున్న కంటెయినర్ వేగంగా ఢీకొట్టి, కొంత దూరం ఈడ్చుకు వెళ్లిపోయింది.

ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. స్థానికులు మల్కాపురం పోలీసులకు సమాచారం ఇచ్చి, ఆమెను షీలానగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు చేస్తుండగా ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని పోలీసులు శవపరీక్ష నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలి బంధువులకు సమాచారమిచ్చారు. కేసును మల్కాపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తీరంలో విజిబుల్ పోలీసింగ్



బీచ్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

జగదాంబ: పర్యాటకుల సంరక్షణ నేపథ్యంలో సాగరతీరాల్లో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. రద్దీగా ఉండే ఆర్కే బీచ్, రుషికొండ బీచ్ వద్ద పర్యాటకులను అలెర్ట్ చేశారు. నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ ఆదేశాల మేరకు మరింత నిఘా పెంచారు.

రోటరీ క్లబ్ సేవలు ప్రశంసనీయం



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు

బీచ్ రోడ్డు: రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎంపీ జీవీఎల్ నరసింహారావు కొనియాడారు. నగరంలోని ఓ హోటల్‌లో రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ నూతన అధ్యక్ష, కార్యదర్శుల నియామకం జరిగింది. ఈ సందర్భంగా జీవీఎల్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ అందిస్తున్న విరాళాలు అభినందనీయమన్నారు. మత్స్యకారులకు ప్రాథమిక విద్య నేర్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులు పి.నాగరాజు, ఎం.వర్మరాజు మాట్లాడుతూ భవిష్యత్తులో మరింతగా సేవలు విస్తృతం చేస్తామన్నారు. అనంతరం నూతన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌ను ప్రకటించారు. వికలాంగులకు బియ్యం బస్తా, ఆయిల్ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రెసిడెంట్ జి.కృష్ణమూర్తి, మాజీ సెక్రటరీ జి.వంశీ చక్రధర్, పీడీజీ సిహెచ్.కిషోర్‌కుమార్, అసిస్టెంట్ గవర్నర్ బి.బ్రహ్మానందం, మాజీ అసిస్టెంట్ గవర్నర్ చింతా నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి యోగా తప్పనిసరి



సదస్సులో పాల్గొన్న అతిథులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా విభాగం ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమైన రెండు రోజుల జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. యోగా కాన్షియస్‌నెస్ ట్రస్ట్(వైసీటీ)తో సంయుక్తంగా ఏయూ అనుష్టాన యోగ వేదాంత ఫర్ హోలిస్టిక్ లివింగ్ అంశంపై ఈ సదస్సు నిర్వహించాయి. ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి యోగా సాధన తప్పనిసరని చెప్పారు. ఈ సదస్సులో 200 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. బెంగళూరు వ్యాస యూనివర్సిటీ వీసీ డాక్టర్ నాగేంద్ర మానవులలో పెరిగే మానసిక ఒత్తిడి పర్యవసానాలు–ఆరోగ్య సమస్యలు అంశంపై ప్రసంగించారు. వ్యక్తి ఆరోగ్యానికి యోగా ఉపకరిస్తున్న పద్ధతులను తెలియజేశారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహారావు మాట్లాడుతూ యోగా కేంద్రం విశ్వవిద్యాలయానికి అతిపెద్ద వనరుగా నిలుస్తోందన్నారు. యోగా కాన్షియస్‌నెస్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ టి.ఎల్.నరసింహారావు మాట్లాడుతూ ఒత్తిడిని నివారించడం, నియంత్రించడంలో యోగా విధానాలు, ఉపయోగాలు తెలియజేశారు. సదస్సు కన్వీనర్ ఆచార్య కె.రమేష్‌బాబు, సంచాలకులు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు.భానుకుమార్, డాక్టర్ సి.శ్రావణి, డాక్టర్ ఆర్.తులసీరావు, డాక్టర్ జ్యోత్స్న అగర్వాల్, డాక్టర్ డి.వెంకటరావు, ఆచార్య పి.రవీంద్రనాథ్, డాక్టర్ శ్రీ కృష్ణ, డాక్టర్ సునీత, నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఏయూ సమాచారమ్

వీసీ ప్రసాదరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు



వీసీకి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న అక్కరమాని వెంకటరావు, తదితరులు



వీసీ ప్రసాదరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న రెక్టార్ సమత, రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డికి ఆదివారం పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ నాయకుడు అక్కరమాని వెంకటరావు వర్సిటీలో వీసీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ అదనపు కార్యదర్శి మెల్లి అప్పారావు, నాయకులు ముచ్చల సురేష్, ప్రసాదుల భాగ్యానంద్, పలువురు కార్పొరేటర్‌లు, పాల్గొన్నారు.

– వీసీ ప్రసాదరెడ్డికి వర్సిటీ ఆచార్యులు, ఉద్యోగులు, పరిశోధకులు పెద్ద సంఖ్యలో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాళ్లు ఆచార్య జి.శశిభూషణరావు, వై.రాజేంద్రప్రసాద్, టి.శోభశ్రీ, వి.విజయలక్ష్మి, అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.జేమ్స్ స్టీఫెన్, అకడమిక్ డీన్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, విద్యావిభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, ఏపీ మారిటైం బోర్డ్ చైర్మన్ కాయల వెంకటరెడ్డి, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ, తైనాల విజయ్‌కుమార్, డాక్టర్ జి.రవి కుమార్, తదితరులు వీసీకి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

రోగులకు పండ్లు పంపిణీ

బీచ్ రోడ్డు: వీసీ జన్మదినం సందర్భంగా రాణి చంద్రమతిదేవి ఆస్పత్రిలో రోగులకు మురళి సోషల్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. సిబ్బందికి పండ్లు, స్వీట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు పి.శంకర్‌రెడ్డి, రాము, నందగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన వర్సిటీ అధికారులు



మొక్కను నాటుతున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో వర్సిటీ అధికారులు మొక్కలు నాటారు. ఆదివారం ఉదయం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి స్వయంగా పాల్గొని కంప్యూటర్ సైన్స్ సిస్టమ్స్ ఇంజినీరింగ్ విభాగం వెనుక భాగంలో నూతనంగా అభివృద్ధి చేసిన రహదారికి ఇరువైపులా వేప, కదంబం, నాగలింగం, పొన్న, పొగడ, వెలగ, గంగవాలి, రేల, జకరందం, రావి, మర్రి, అడవి జువ్వి తదితర జాతులకు చెందిన మొక్కలను నాటారు. త్వరలో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని వీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, డీన్ ఆచార్య జి.వీర్రాజు, శ్రీధర్, డాక్టర్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఒడియా భాషలోకి 'సింహాచలం క్షేత్ర మహత్యం'



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఈవో త్రినాథరావు, లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్

సింహాచలం: ఒడియా భాషలో రచించిన శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి క్షేత్ర మహత్యం పుస్తకావిష్కరణ ఆదివారం సింహగిరిపై ఘనంగా జరిగింది. సింహాచలానికి చెందిన పాంచరాత్ర ఆగమశాస్త్ర పండితుడు టి.పి.శ్రీరామచంద్రాచార్యులు తెలుగులో రచించిన సింహాచలం క్షేత్ర మహత్మ్యం పుస్తకాన్ని ఒడియా భాషలోకి భక్తుడు సాయికుమార్ తర్జుమా చేశారు. ఆ పుస్తకాలను స్వామివారి ఆలయంలో దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్‌నాయక్ దాస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవోలు వి.బి.వి.రమణమూర్తి, భ్రమరాంబ, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

ఘనంగా స్వర్ణపుష్పార్చన



నిత్య కల్యాణంలో యజ్ఞోపవీతం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి 8 వరకు స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శోభాయమానంగా అలంకరించి కల్యాణ మండపంలోని వేదికపై వేంజేపచేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో భ్రమరాంబ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేసి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేణపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని జరిపించారు. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను అందజేశారు.